


# మా జరీనాంటీ స్పెషలు సెలవల కత!

మా యిద్యానికేతన్‌లో నెలకొక తడవ, శుక్కురోరం రోజు మా కిలాసులోకి సర్కులరు బుక్కు వస్తుంది. మా రమాదేవి టీచరో, శశిప్రబ టీచరో ఆ సర్కులరు బుక్కుని చేతిలోనికి తీసుకొనంగానే దాంట్లో వుండేదేందో మాకు ముందరే తెలుసు కాబట్టే యిద్దరమో ముగ్గురమో పిలకాయలం ఒకేసారి పైకి లేచేసి మా టీచరు కంటే ముందరే ఆ సర్కులరుని ఒప్పచెప్పేసేవాళ్లం.

'టుమారో యీజ్ హాలిడే... ఆన్ అకౌంట్ ఆఫ్ సెకండ్ స్టాటర్ డే' అని మేం ఒప్పచెప్పంగానే కిలాసులో వున్న టీచరు కూడా మాతో పాటు నవ్వేస్తా 'రేపు రెండో

శనివారం. ఇస్కూలు వుండదురో' అనేది- సర్కులరులో సంతకం పెడతా.

నెలకొక తడవ యిట్టా సెకండ్ స్టాటర్ డే, సండే కలిసొస్తే రెండు రోజుల పాటు ఆరాంగా ఆడుకోవచ్చుకదా అని మా కిలాస్‌లోని సతీషు సింగుగాడో కందుల మాలకొండ రావుగాడో అనుకోవచ్చుగానీ నాకు మాత్రం ఆ కర్మే పట్టలా.

ఏమంటే ఆరాంగా ఆడుకునేందుకు నాకు మా ఇస్కూలు యిచ్చే సెలవల్లే కాకుండా యింకో రకం స్పెషలు సెలవలు కూడా వున్నాయి.

వాటి పేరు జరీనాంటీ సెలవలు!

వారానికో రెండు వారాలకో ఒక తడవ మా జరీనాంటీ, జరీనాంటి బర్త వాజీద్ సాయిబు కుంగా సావకొట్టేసుకొని నువ్వెంత? అంటే నువ్వెంత? అనుకునేస్తారు కదా! అప్పుడు మద్దెస్తానికి (రాజీకి) టంచనుగా మా అమ్మా నాయినా బయలుదేరాలి. జరీనాంటీకి చెప్పాల్సిన మాటలు జరీనాంటీకీ, వాజిద్ సాయిబుకు చెప్పాల్సిన మాటలు వాజిద్ సాయిబుకీ చెప్పి ఎట్నోకట్ట చేసి వాళ్ళకి రాజీ చెయ్యాలి. అప్పటికిగానీ వాళ్లు వీదిలో నుంచి యింట్లోకి కదలరు.

మా జరీనాంటీ వాజిద్ సాయిబూ యిట్టా తగూలాడుకున్నప్పుడల్లా మా అమ్మా నాయినా చెప్పే మాట తప్పితే సాయంగా ఆ దేవుడు దిగొచ్చి చెప్పినా వినరు కాబట్టి వీళ్లు తగులాడుకున్నారంటే ఆ రోజింక మన యిస్కూలికి సెలవు కిందే లెక్క. (మద్దెస్తానికి మా అమ్మ వెనకనే మనం కూడా తయారవతాంకదా- అందుకని).

యింతకీ యీ జరీనాంటీ (జరీనా+ఆంటీ) ఎవురంటే మా అమ్మకి సాయానా చెల్లెలు. మా పెదమ్మ, మా అమ్మ పుట్టినాక మా అమ్మమ్మకు కొడుకు పుడతాడనుకుంటే జరీనాంటీ పుట్టిందట. అయినాగానీ ఆడింది ఆట పాడింది పాటగా ఎదిగి చివరికి వాజిద్‌సాయిబు పాలబడింది. పెళ్లయిన కాణ్ణుంచి రోజూ వాళ్లది రచ్చ కాపరమే.

ఒకరోజున మేము పక్కల మీది నుంచి సరిగా లేవనుకూడా లేవక ముందే మా జరినాంటీ కూతురు ఏడేళ్ల ఆలిమా ఏడ్చుకుంటా వచ్చింది మా యింటికి.

'ఆంటో…బాబా… అమ్మను కొట్టేస్తా వున్నాడు ఆంటో' అనింది మా అమ్మతో ఏడస్తానే.

ఆ మాటలు వినంగానే మా అమ్మ మొకంలో యాడలేని చురుకంతా వచ్చేసింది. 'మళ్లా మొదులుపెట్టినాడా మీ నాయినా… ఆట?' అనింది మంటగా.

మా అమ్మ చురుకుకి మా నాయిన లేచి కూచున్నాడు. పొద్దున్నే యిదేమి

తలకాయనొప్పిరా అన్నట్టుగా చేతి వేళ్ల వంక చూసుకుంటా 'ఏం చేస్తాం... పా' అన్నాడు మా అమ్మతో.

అందరం బయలుదేరినాం. ముందు మా అమ్మా ఆలిమా. వెనక మా నాయిన. ఆనేక పెద్ద పుడింగిలాగా నేను.

మేము పోయే సరికే కొట్టేసుకోవడం పూర్తయిపోయినట్టుంది... వాకిలి బయిటొకరు, వాకిలి లోపలొకరు కూచోనుండారు ఎడ మొకం పెడ మొకంగా. మా జరినాంటీ కుయ్‌కయ్‌మంటా వుంటే వాజిద్ సాయిబేమో చేతిలో గీతా పళ్లపుడేసుకొని కూచోనున్నాడు గమ్మగా.

'రా అకా. తీసకపో నీ చెల్లెల్ని. యింక నా వల్లకాదు' అన్నాడు మా అమ్మను చూట్టం తోటే.

'ఎందుకని నాయినా? ఎవురి ప్రాణాలు పెరక్క తినిందనా?' అనింది మా అమ్మ విదిలింపుగా. మా అమ్మ ఆ మాటనేసరికి 'చూడకా. ఎట్టా కొట్టి సంపేస్తున్నాడో' అనింది జరినాంటీ- పెద్దగా ఏడస్తా.

ఎర్రగా తట్లు తేలిన జరినాంటీ బుగ్గల్ని చూసి మా అమ్మకి సర్రన ఎక్కిపోయింది కోపం. 'నీ చేతులిట్టా మిడిసిపడతా వున్నాయేమయ్యో వాజిద్. ఇది నీకు మర్యాదైన పనేనా చెప్పు?' అనింది అక్కసుగా.

వచ్చీరాంగానే కుర్చీలో కాళ్లు చాపుకున్న మా నాయిన కూడా నోరావలిస్తా 'దీనికి నీ సంజాయిషీ ఏంది?' అన్నట్టు చూసినాడు వాజిద్ సాయిబు తట్టు.

'అంతేలే అకా. మీరు దాని ఏడుపే చూస్తారుగానీ నా బాద చూస్తారా?' అన్నాడు వాజిద్ సాయిబు మా అమ్మ తట్టు నిష్ఠూరంగా చూస్తా. 'పొద్దున లేస్తే జేబులో డబ్బులు పోతా వున్నాయే ఆ సంగతి ఎవరితో చెప్పుకునేది?' అన్నాడు మళ్లా.

'ఏమ్మే?' అని అడిగింది మా అమ్మ, జరినాంటీ తట్టు చూస్తా.

'అయ్యో... వొట్టకా... ఒక్క రూపాయి కూడా నేనెరగను. డబ్బులు కావాలంటే అడిగి తీసుకోనా? దొంగతనం చేసే కర్మ నాకేమి పట్టింది?' అనింది జరీనాంటీ.

ఆ మాట వినడంతోటే నాలిక కొరకతా ఒంటికాలి మీద లేచినాడు వాజిద్ సాయిబు.

'చూడకా. ఇదీ వరస. తీస్తదీ ఏమీ ఎరగనట్టు ఒట్టేస్తది. రాత్రి చొక్కా జేబులో రెండు యాభై నోట్లు పెట్టి పొణుకున్నాను. పొద్దున లేచి చూస్తే ఒకాభై వుంది. ఒకాభై లేదు. ఏమైనట్టు? చిలక్కొయ్య మింగేస్తుందా? అయ్యసలే సామాన్ల డబ్బులు. యిప్పటికిప్పుడు

యాబై రూపాయిలు యాణ్ణుంచి తెచ్చేది?' అని నెత్తికొట్టుకున్నాడు.

(సామాన్ల డబ్బులంటే రేడియో సామన్లని అర్ధం. వాజిద్ సాయిబుకి మా కావలిలోని పొట్టి శ్రీరాములు సెంటర్లో చిన్న రేడియో మెకానిక్ షాపు వుంది. స్టార్ ఎలక్ట్రానిక్స్ దాని పేరు. పేరుకది స్టార్ ఎలక్ట్రానిక్సే అయినా వాజిద్ సాయిబుకి స్టారులా. పొగులు పొద్దస్తం ఆ షాపుల్లో కూచొని రేడియోలని గుర్రుగుర్రుమని రిపేర్లు చేస్తా రోజుకి ఆయన సంపాదించేది యాబయ్యో అరవయ్యో. ఒకో రోజు రేడియోలు రిపేరుకి రాకపోతే ఆ సంపాదన కూడా లా.)

సామాన్ల డబ్బులనేసరికి మా నాయిన కూడా అట్టా సామాన్ల డబ్బులు జేబులో పెట్టుకొని తిరిగేవాడే కాబట్టి క్షణాల్లో వాజిద్ సాయిబు పక్షం వహించేశాడు. 'ఏమ్మే జరీనా! ఎవరో ఏందో సామాన్ల కోసరమని డబ్బులిచ్చుంటారు. వాటిని నువ్వు నూకేస్తే ఎట్టమ్మే' అన్నాడు మందలింపుగా.

'అయ్యో దూలేజాన్ (చినబావ)! నువ్వు కూడా అట్టంటావేంది? సత్తె ప్రమాణకంగా చెబుతున్నా. నేను తియ్యలా. ఈ ఎతిమతం మనిషే రాత్రి వచ్చేటప్పుడు యాడో పారేసుకొని వుంటాడు' అనింది ఖాయంగా.

వాజిద్ సాయిబు కొరకొరా చూసినాడు ఆ మాటలకి. 'చూసినావా కరీంభాయ్! యిట్టాంటి కంత్రీ ఆడ మనిషితో ఏమని కాపరం చేసేది చెప్పు. ఒకరోజయితే సరే. రోజూ అదే దరువాయెనే. ఇంటికొచ్చి చొక్కా తగిలిస్తే చాలు డబ్బులు గాయబ్ చేసేస్తా వుంది. అట్టాగని నేనే తీసుకున్నాలే అని చెప్తుందా అంటే అదీలా' అన్నాడు బాదగా.

మా అమ్మ ఆ మాటలు విని, వాజిద్ సాయిబు తట్టు జరినాంటీ తట్టు మార్చి మార్చి చూసి 'అజబుగుందమ్మా మీ కాపరం' అనింది యింకేమనాలో తెలియక.

'అది కాదమ్మే! నీకు కావాలంటే అడిగి తీసుకోవచ్చుకదా' అన్నాడు మా నాయిన జరీనాంటీతో.

'మళ్లా అదేమాట దూలేజాన్! కావాలంటే చెప్పు. ఎవురి మీద ఒట్టెయ్యమంటావో చెప్పు' అనింది జరినాంటీ రుజువుకు లేస్తా.

వాజిద్ సాయిబుకు పూనకం వచ్చేసింది.

'పామ్మే. ఖురాన్‌కాడికి పా. ఖురాన్ మీద ఒట్టేసి చెబుదూకానీ అదే మాట' అన్నాడు యింతెత్తుకు ఎగరతా.

జరినాంటీ కూడా తిరుక్కునేసింది. 'పా. నాకేమన్నా బయమా? ఖురాను నెత్తి మీద

పెట్టుకొని మరీ చెబుతా. నేను తియ్యలా. తియ్యలా. అంతే' అనింది, తెంపుగా.

వాజిద్ సాయిబు రోతగా చూసినాడు జరినాంటీ తట్టు.

'చీ చీ. ఇంత గుండెలు తీసిన బొంటుని యాడా చూళ్లేదు' అని, యింకాడ ఉండటం యిష్టంలాక చొక్క తొడుక్కొని బజారుకు వెళ్లిపోయినాడు విసురుగా.

ఆయన్నట్టా పోనిచ్చి- 'యిప్పుడు చెప్పుమే. ఏందీ పనులు. సామాన్ల డబ్బులు జేబులో వుంటే నువ్వు నూకేస్తే ఎట్టా?' అన్నాడు మా నాయిన- దొంగ నువ్వేలే సంగతేందో చెప్పు అన్నట్టు.

జరినాంటీ సత్తెం చెప్పేసింది.

'ఏం చేసేది దూలేజాన్. ఇదంతా నా కర్మ. ఒకరికిద్దరు బిడ్డల్ని కనినాడే ఆ మనిషి రోజూ దోపిడీ చేసో దొంగతనం చేసో టయానికి డబ్బులు యింటికి పంపీబళ్లా? అదిలా. మద్యానం పదకొండుకో పన్నెండుకో లింగు లింగుమంటా పదో పన్నెండో పంపుతాడు పెద్ద ముల్లెలాగ. ఇంట్లో వుండేది నలగరం. మేముగాక అంగట్లో పనిపిల్లోడొకడు. అయిదుమందికి పది రూపాయలతో రెండు పూటలా వండి వార్చాలంటే అయ్యే పనేనా. నువ్విచ్చేది సంటిదాని పాలకే సాలవయ్యా... యింక రొన్ని డబ్బులియ్యయ్యా అని ఎన్నిసార్లు బతిమిలాడినానో అడుగు. ఎప్పుడడిగినా యివి సామాన్ల డబ్బులు తాకబాక. అవి సామాన్ల డబ్బులు తాకబాక అని అంటాడేకానీ చెయ్యి సాచి యిదిగో అంటా యిచ్చి ఎరిగినాడా? అట్టాంటి మనిషున్నప్పుడు దొంగతనం చేయక బావిలో దూకి సావమంటా?' అని బొలబొలమని ఏడ్చేసింది.

జరినాంటీ జవాబుకు మా నాయిన బిత్తరతో తడుముకుంటే, మా అమ్మ నోటి మీద చెయ్యేసుకునింది.

'అయితే మాత్రం సేయ్! ఖురాను మీద ఒట్టేసేదానికి రెడీ అయిపోవడమేనా? కళ్లు పోతాయే లమిడి' అనింది బయం చెప్తా.

'పోనీలే అకా. నా బిడ్డల కంటేనా. నా మొగుని కంటేనా. వాళ్ల కడుపు నిండితే అంతే చాలు' అనింది మా బంగారు జరినాంటీ- కళ్లమ్మట కారే నీళ్లని పవిటతో తుడుచుకుంటా

